# రాణీ సాహేబా రంగయ్యమ్మారావు

ప్రొద్దు పడమటికి వ్రాలినవేళ. ఎండను జల్లెడలో పట్టి జల్లించినట్టున్న వేపచెట్టునీడ. చేతికి దొరికిన గడ్డిపోసను నములుకుంటూ ఆ నీడలో చెట్టు మొదలు కానుకుని పడుకున్నాడు వెంకటేసు, అతడి పాలిటికది నమలడానికి గడ్డిపరకలు తప్పితే మరేమీ దొరకని దుర్దినమై పోయింది మరి!

ఇప్పుడైతే యిలా గడ్డిపోసలు చప్పరించే దౌర్భాగ్యం పట్టింది గానీ ఇటీవలివరకూ, అంటే మొన్నటి సాయంకాలం దాకా రకరకాల పిండివంటలతో నాలుకకు పదును పెట్టుకున్నవాడే వెంకటేసు. గారెలూ, బూరెలూ నమిలినవాడే. సుగీలు స్వాహా చేసినవాడే, కమ్మని కజ్జాలు దిగ మ్రింగినవాడే. కరకరలాడే మురుకుల రుచి అతడు బాగా ఎరుగును. కానీ ఆ గత వైభవాలను తలచుకుంటే యిప్పుడేమి ఒరుగును?

ఐనా ఎంతటి దిక్కుమాలిన కక్కుర్తి యంత్రమయ్యా ఈ మానవశరీరం! మూడు నెలల పొడుగునా దీనికి రాజనాలే వండించి పెట్టు. కడుపునిండుకూ పాయసాలే పోయించు. పదహారు కూరగాయలతో, ముప్పైరెండు పిండివంటలతో తెగమేపు. ఈ మృష్టాన్నాలతో చర్మం ఒక వరస నిగనిగలాడిపోయిన తర్వాత. ఆ మూడు మాసాల చివర ఒక రెండు రోజులు, రెండంటే రెండే రోజులు తిండిరంధి లేకుండా, రెస్టు తీసుకుంటూ ఈ శరీరయంత్రం హాయిగా వుండిపోవచ్చుగదా! ఉండదే! పట్టుమని ఒకపూట కిక్కురు మనకుండా ఊరుకోగలిగితే బ్రహ్మాండం! రెండోపూట మొదలయ్యే సరికి కడుపులో కాకిగోల. ఆ రోజు రాత్రి నిద్రపట్టడంగూడా అనుమానమే! చన్నీళ్ళు పోయకపోతే వేడెక్కిపోయే యింజనులా మరునాటి వుదయం కడుపులో మంటలు బయల్దేరకపోతే ఒట్టు! అప్పుడిక నీరెండ గూడా నిప్పుల వానలాగే వుంటుంది. రైల్లో కూచోకపోయినా కళ్ళయెదుట లోకం గిర్రున తిరుగుతున్నట్టే వుంటుంది. నడిచే ఓపికమాట దేవుడెరుగు, లేచినిల్చుంటే ఒళ్ళు దూది పింజెలా గాలి కెగిరిపోతుంది. బాబూ పట్టెడన్నం! లేదా గ్రుక్కెడు గంజి నీళ్ళు... ఆ తపనగూడా యిలా ఎంతోసేపు కొనసాగదు. అవయవాలతో బాటుగా బుద్ధిగూడా మొద్దుబారిపోతుంది. పెరికి పారవేసిన తోటకూర కాడలా శరీరం నేల కంటుకుపోతుంది. ఒకరు చెబితే అర్థమయ్యేదిగాదు. ఆ పరిస్థితి అనుభవైకవేద్యం అలాంటివాళ్ళని చూచినప్పుడే మనం “అయ్యో పాపం! ఆకలి దెబ్బకు శోష్లిల్లిపోయినట్టున్నాడు” అనుకుంటాం.

ఆకాడికి వెంకటేసు ఎంతో నయం! తిండికి తనకూ వియోగం ప్రాప్తించి రెండు రోజులు కావస్తున్నా అతడింకా సొమ్మసిల్లిపోలేదు. చేయిసాచి దగ్గర్లో వున్న గడ్డిపరకలు పెరుక్కునేపాటి చైతన్యం అతడిలో యింకా మిగిలేవుంది.

కానీ అతడి పేగులు నకనకలాడి పోతున్నాయి. నాలుక పిడచగట్టుకపోయింది. కళ్ళు లోతుకుపోయి కొడిగట్టిన దీపాల్లా గుడ్డిగా జోగుతున్నాయి.

వెంకటేసు పడుకున్న చోటికి ఒకమైలు దూరం పరిధిలో అయిదారు పల్లెటూళ్ళున్నాయి. కచ్చితంగా ఆరుపల్లెలని లెక్కచెప్పకుండా అయిదారనడంలో ఒక ఆంతర్యముంది. ఆరోపల్లె వుంది చూచారూ, దానికి పేరులేదు. గూడెం అంటారు ముక్తసరిగా. పేరేగాదు, గూడెంలో వీధులుగూడా లేవు. చుట్టూరా పంటపొలాలుండటంవల్ల ఆ వూరి వైశాల్యం విస్తరించే అవకాశం లేదు. జనాభా సంగతి అలాకాదుగా! అందువల్ల కుండలో నారుపోసినట్టుగా ఆ వూరు వూరంతా గుడిసెల మయం. పొదుపును గురించి ప్రత్యేకంగా అక్కడెవరూ పాఠాలు చెప్పివుండరు. గూడెంలోని జనం ఇతరులు చెప్పకపోయినా ఉత్తమ జీవిత విధానాలను అమల్లోపెట్టే బుద్ధిమంతులు. మట్టితోనే గోడలు, తాటాకులతో పైకప్పు, వెదురు తడికలతో తలుపులు, గోడలకు సున్నం వుండదు. బయటినేలకు, గుడిసెలోపలి నేలకు తేడావుండదు. గూడెంలో అడగుపెట్టగానే ముక్కుపుటాలకు యింపితంగాని చెమ్మవాసన. కోళ్ళు, కుక్కలు, వంటకట్టెలు, మట్టికుండలు, గోనెసంచుల్లా మాసిపోయిన గుడ్డలు, చింపిరితలలు, ఈ హంగులవల్ల పదివేల యేండ్ల మానవ నాగరికత తీవ్రమైన సవాలుకు గురిగావడం ఆ పల్లెలో చూడవచ్చు. శిలాయుగం నాటి మానవ జీవనాన్ని గురించి సినిమా తీయదలచుకున్న వాళ్ళు చక్కా తమ అవుట్‌డోర్ షూటింగును గూడెంలో పెట్టుకోవచ్చు. ప్రత్యేకించి సెటింగు వేయనక్కరలేదు.

వేపచెట్టు నీడక్రింద పడుకున్న వెంకటేసు ఎండిపోయిన పెదవులను నాలుకతో తడిచేసుకున్నాడు. ఆహారం దొరికిన సంబరమేమో, చెట్టు కొమ్మల్లో ఉడతలు రెండు కిచకిచమంటున్నాయి. ఎక్కడో ఆకాశంలో తెల్లటి చుక్కల్లా ఎగురుతున్న గ్రద్ద ఒకటి ఒక్క పెట్టున క్రిందికి దిగి వచ్చి కాలివ్రేళ్లతో ఎరను లంకించుకొని రివ్వున పైకెగిరిపోయింది. దూరంగా మల్లేశ్వరుడి గుట్టపైన కడుపునిండుకూ పచ్చిక మేసిన ఆవులు మెల్లమెల్లగా క్రిందికి దిగివస్తున్నాయి. అడవి పక్షుల కెవ్వడాహారమిచ్చెను. మృగజాతికెవ్వడు మేతబెట్టె అంటూ చిన్నప్పుడు చదువుకున్నవాడు వెంకటేసు. ఇన్ని ప్రాణుల కిన్ని విధాలుగా ఆహారం సప్లయిచేస్తున్న భగవంతుడు రెండు రోజులుగా తనను మాత్రం లిస్టులోనుంచి తొలగించాడు! భగవంతుడిదాకా ఎందుకు? వెంకటేసుకు గూడెంలో ఒక గుడిసెవుంది. రంగి అంటూ ఒక పెళ్ళాం వుంది. రోజుల తరబడి తానింటిముఖం చూడకపోయినా "నాన్నా, నాన్నా" అంటూ తనవెంటబడి తిరిగే ఎనిమిదేళ్ళ కుర్రకుంక ఒకడున్నాడు. రంగి తప్పకుండా మధ్యానం అన్నం వండే వుంటుంది. రెండు పూటలకు ఒక్కసారే చేసుకోడం గనుక తినింది పోగా కుండలో కొంత అన్నం యింకా మిగిలేవుంటుంది, అన్నంగాక పోతే సంగటి. అదీగాకపోతే అంబలి. ప్రాణం నిలుపుకోడానికే గదండీ తిండి! మొన్నటివరకూ రాజభోజనం దొరికింది. వెంకటేసేం వద్దన్నాడా! నిన్నటి నించీ నిప్పచ్చరంగా వుంది. అలాగని యిప్పుడుగూడా అలాంటి రాజభోజనమే కావాలని వెంకటేసుకేమైనా పట్టింపుగా వుందా? లేదు. ఆకలిగా వున్నప్పుడు తనకు రంగిచేతివంట కూడా అమృతంలా ఉంటుంది. కానీ ఏ ముఖం పెట్టుకుని తనీ రోజున గూడెంవైపు వెళ్ళగలడు? గూడెంలో అడుగుపెట్టడమంటే తనకిప్పుడు తలకొట్టి మొలవేసినట్టే వుండదూ?

ఉంటుంది. అంతకంటే అవమానంగా కూడా వుంటుంది. ఎందుకుండదు? వెంకటేసు గూడెంవైపు తిరిగి చూచి మూడు నెలలైంది. ఈ మూడు మాసాలకాలంలో అతడికి గూడెం వల్లకాటి దిబ్బకు మల్లే పోరానిచోటుగా పరిణమించింది. అక్కడి మనుషులు సజీవులైన నడపీనుగుల్లా కానవచ్చారు. అది పెళ్లాంగాదు. తనకు చుట్టుకున్న పీడ. వాడు కొడుకు కాదు. వదలకుండా తనకు తగులుకున్న జంజాటం.

మరైతే ఈ మూడు మాసాల సంధికాలంలో ఒక మానవుడి బుద్ధి యిలా ఎందుకు మారింది?

కారణం లేకపోలేదు.

పండగ అనవచ్చు దాన్ని! "ఓట్ల పండగ" అనడం మరీ బాగుంటుంది. అది పీర్లపండగలా వచ్చింది. పోలేరమ్మ జాతరలా వచ్చింది. "కాశీపట్నం చూడర బాబూ, గంగాఘట్టం చూడరబాబూ" అన్నట్టుగా చిన్న ఓటులోనుంచీ గంపెడు ఆశలు చూపెడుతూ వచ్చింది. "భామనే, ఒయ్యారి సత్యభామనే" అంటూ బయల్దేరి దుమ్మెగిరేటట్టుగా రంగస్థలంలో చిందులు ద్రొక్కే ఆడవేషంలా దేశమంతా గగ్గోలయిపోయేటట్టుగా వచ్చింది. తినబోతే దొరకని తియ్యటి మామిడి పండులా కొన్ని వందలమంది కొక్కటే కుర్చీ. అందులో ఎవరైనా ఒకరు మాత్రమే కూచోవాలి. ఇందుకు కావలసింది ఓటర్ల బలమే! అదెలా లభ్యమౌతుంది? యోగ్యతను బట్టి లభ్యం గావడం న్యాయం. కానీ యోగ్యతనంతగా పట్టించుకొనేవాళ్ళు లేకపోయారు. ఇంతకంటే గత్యంతరం లేదని నచ్చజెపుతూ సామం బయల్దేరింది. 'మీవి ఓట్లు. నావి నోట్లు. అవసరాన్ని బట్టి వేలం పాటను పెంచేదేగాని దించేది లేదంటూ రవితేజంతో దానం ముందుకు నడిచింది. కులం పేరు మతంపేరు చెప్పుకుంటూ భేదం విజృంభించింది. ఈ మూడు పద్ధతులూ వమ్మయిపోతే చివరకు నేనున్నాను లెమ్మని దండోపాయం హెచ్చరిక చేసింది.

సింగవరంలో ఎలా వుంది బాబూ? మంగిపాడులో ఏమైంది? నూకవరం సంగతి ఏమైనా తెలిసిందా? ఓ యాభైయేళ్ల క్రితం గనుక యిలాంటి ప్రశ్నలు పొడసూపివుంటే ఆయా వూళ్ళల్లో అప్పుడు మశూచిలాంటి తీవ్రమైన జబ్బు ఏదో విశృంఖల విహారం చేస్తుందే దన్నమాట? ఇప్పుడిలాంటి ప్రశ్నలన్నీ ఆయా వూళ్ళల్లో ఓట్లజాతర తాలూకు సంరంభం ఎలావుందన్న కుతూహలానికి మారువేషాలుగా పరిణమించాయి.

ఓట్ల తిరణాల ఒక విధంగా వీధినాటకం లాంటిది గూడా? నటీనటుల సంఖ్య కొద్దిపాటిదైనప్పటికీ మిగిలిన ఓటర్లందరూ హంగుదారులే! ఈ నటీనటుల్లో మళ్ళీ రెండురకాలు. తమకుతామే రంగు పూసుకునేవాళ్ళు కొందరైతే పరిస్థితుల ప్రోద్బలంవల్ల రంగు పూయించుకొనేవాళ్ళు కొందరు. ఈ వర్గీకరణలో రెండోరకం క్రిందికే వస్తాడు వెంకటేసు.

చిలక సముద్రం చిన్న పంచాయతీ గ్రామం. ఆ పేరు గలిగిన ఊరుగాకుండా గ్రామంలో వున్న పల్లె లయిదే. ఒకటి గుండ్లూరు. అది చిలక సముద్రానికి కూతవేటు దూరంలో వున్న పల్లె. పేరుకు వేరే వూరయినా అది చిలక సముద్రంలో కలిసివున్నట్టే లెక్క. మిగిలిన నాలుగింటిలోనూ మూడూళ్లు దూరంగా విసిరివేయబడ్డట్టుగా ముఖ్య

గ్రామానికొకటి రెండు మైళ్ళ దూరంలో ఉన్నాయి. ఈ మూడింటిలో నాయకస్థానం బూరగపాడుది. గ్రామం ఒక త్రాసయితే దానికొకవైపున చిలకసముద్రమున్నూ మరొక వైపున బూరగపాడున్నూ! కారణం దొరకడమే ఆలస్యం, ఉభయపక్షాలు దొమ్మీకి సిద్ధం. ఆ కారణం ఎంత చిన్నదైనా పరవాలేదు కోడిపుంజుల జగడాలను రాజ్యాల మధ్య యుద్ధాల స్థాయికి డెవలప్ చేసిన శౌర్యాభిలిప్స జాతిలో యింకా చనిపోలేదు. ఇందుకు చిలకసముద్రం, బూరగపాడు రగడలే ప్రత్యక్ష తార్కాణం!

ఎన్నికల సందర్భంలో చిలకసముద్రం చెంచునారాయణప్పకు ప్రాణగొడ్డంలాంటి విషమసమస్య ఒకటి వచ్చిపడింది. నిస్సందేహంగా మూడు వార్డులు తనవి. కానీ ప్రత్యర్థి బూరగపాడు హనుమంతప్పగూడా యింతే బలాన్ని చేజిక్కించుకుని రంగంలో మోహరించివున్నాడు. ఇప్పుడు జయాపజయాలు రెండూ ఒక ఏడో వార్డుపైన్నే ఆధారపడి వున్నాయి. ఆ ఏడో వార్డే గూడెం!

ఒకనాటి సాయంకాలం పొందికగా తలగుడ్డ చుట్టి మెత్తటి చెడావులు తొడిగి, విలాసంగా చేతికర్ర వూపుకుంటూ చెంచు నారాయణప్ప గూడెంలో ప్రవేశించి వేపచెట్టు క్రింద రచ్చపైన కూచున్నాడు.

ఏలినవాడే పాలితులదగ్గరికి నడచి రావడమన్నది భారతీయులకింకా క్రొత్తగానే వుంది. పుట్టి భూమిపైన పడింది మొదలు గూడెంలోని జనం యిలాంటి వింతను చూచి ఎరుగరు.

చెంచు నారాయణప్పగారి హితోపదేశం నల్లేరుపైన బండిలా సాగిపోయింది.

"అబ్బాయిలూ! జాగర్తగా యినండి! ఒరే కోటిగా! నారిగా! గురులింగం! అందరూ యినండి. ఈ రోజెన్నికలొచ్చాయి. రేపెల్లిపోతాయి. ఎల్లకాలమూ వుండేది గ్రామం. దాని బాగు మనసులో పెట్టుకుని తరవాత మనం మిగిలిన విషయాల్ని గురించి ఆలోచించాలి. పెద్దలొక మాటన్నారు. ఏమని? పోరునష్టమనిన్నీ, పొందులాభమనిన్నీ! ఎంత మంచి మాటలన్నారో చూశావా గవరయ్యా! ఈ రోజు ఎలక్సను పేరు సెప్పి దేశం దేశమంతా గొంతుబంటిదాకా పోటీల వూబిలో దిగబడిపోయింది. పోతే పోయింది. మనవరకు మనం కలిసికట్టుగా వుందామంటే ఆ బూరగపాడు అనుమంతప్పేమైనా నా మాట యిన్నాడా? నువు సెప్పడమేమిటి, నే వినడమేమిటి? ఈ గ్రామానికి నువ్వెంతో, నేనూ అంతేను! పో పొమ్మన్నాడు. ఇన్నావా శీతారాముడూ?"

"ఎంతమాటెంతమాట! తమరెక్కడ. ఆయనెక్కడ? తమరు దరమరాజులు గదండీ..."

"అబ్బే, దరమరాజుని గాకపోవచ్చు. కానీ యమధరమరాజుని కాదు గదా! అదీ, ఆ విషయం మీరు గ్నెప్తిలో వుంచుకోవాల. అలాగని నేనేదో మీపైన జులుం చెలాయిస్తున్నా ననుకోవద్దు. మీకందరికీ నేను తలా కొంచెం అప్పుపెట్టి వుండొచ్చు. మేమూ, మా పొలాలు లేకపోతే మీకు బ్రతుకు లేకపోవచ్చు. కానీ దీనికి దానికి సంబంధం లేదు. చిల్క సముద్రమూ, గూడెమూ ఓబికాలంనుంచీ ఒక తల్లిబిడ్డల్లాగా వున్న సంగతి ఈ

పాయకట్టులో అందరికీ తెలుసు. నేను సెప్పేదేమిటంటే యికపైనగూడా అలాగే జరిగిపోవాల. మనందరం ఒక తాటిపైన నడవాల ఒకమాట పైన వుండాల..."

"ఎవరికోసం వుంటామండీ బాబుగోరూ! మీసొత్తే తిని మీకే దురోహం సేత్తామా? సేత్తే కళ్ళుంటాయా? తమరు మమ్మల్ని కంటికి రెప్పగా చూచుకునేదిన్నీ, మేము మీరు గీసేగీటు దాటేదీనా? మా బొందిలో వూపిరుండగా అలా జరగదు! ఎటువంటి ప్రెమాణకం సేయమన్నా సరే, మీమాట జవదాటేది లేదు..."

చెంచు నారాయణప్పగారు వెళ్లిపోయిన తర్వాత ఆ రోజు రాత్రి గూడెంలోని పిన్న పెద్దలందరూ కలిసి మళ్ళీ ఒక సభ ఏర్పాటు చేశారు. అందులో వెంకటేసును తమ ఏకైక ప్రతినిధిగా ఎన్నుకున్నారు. మరేంలేదు. వెంకటేసు చిన్నప్పుడు తన అమ్మమ్మగారింట్లో వుండి అయిదో తరగతిదాకా చదువుకున్నాడు. కళ్ళు మూసుకుని సంతకం పెట్టేయగలడు. తోమిన దుస్తులు గనుక తొడుక్కొని, తల సుబ్బరంగా దువ్వకుంటే మనిషి పంచాయతీ బోర్డు మెంబరనుకోడానికి తగినట్టుంటాడు.

నామినేషన్లదాకా అంతా సవ్యంగానే గడిచిపోయింది. తీరా ఆ మరునాడు తెల్లవారేసరికి వెంకటేసు గూడెంలోలేదు. చిలకసముద్రంలో లేదు. గుండ్లూరులోనైనా కానరాలేదు. తోటలు, దొడ్లూ, పొలాలు, ఎక్కడా కానరాలేదు!

ఇక్కడ చెంచు నారాయణప్పగారిలా వెంకటేసుకోసం అన్వేషణ సాగిస్తున్న సమయానికి సరిగ్గా అక్కడ వెంకటేసును తన ఎదుట కూచోబెట్టుకుని బూరగపాడు హనుమంతప్ప శుక్రనీతి బోధిస్తున్నాడు.

"ఒరే ఎంకటేసూ! గూడెం గూడెం అంటావు. గూడెం తవ్వి నీ తలకెత్తిందేమిటో సెప్పరా? మీ ఖామందు అదే సిల్కసముద్రం నారప్ప నీ తలపైన పెట్టిన కుచ్చుకుళ్ళా యెక్కడుందో సూపించరా! ఎందుకురా నీకీ లేనిపోని ఆశలు? మాటేమిట్రా నీ తలకాయ! మహామహావాళ్ళు మాటకే నిలబడివున్నారా! ఎప్పుడైతే నువు నా చేతిలో పడ్డావో అప్పుడే నీ అదురుష్టం పండిందనుకో? అడ్డూ, ఆపూ లేకుండా నువ్విక్కడే వుండిపోరా ఎంకటేసూ! మస్తుగా తిను, మాయని బట్ట కట్టుకో. కంటినిండుకూ నిద్రపో, నువ్వు నాకు వేసేదల్లా ఒక ఓటు. అయిదేళ్ళ పాటు నిన్ను దొరబిడ్డలా చూచుకునే పూచీనాది, ఆ తరువాతి సంగతంటావా? అప్పటికే రాజు ఏ రాజ్యమేలతాడో ఎవరు చూచారు? ఎంతగా గూడెం వాళ్ళు తన సెప్పుసేతల్లో ఉంటే మటుకు ఉత్తుత్తి మాటలతో ఓటు కొట్టేయాలని చూస్తాడా చెంచునారణప్ప; ఏం, మనిషి మనిషి కీ ఓ పదిరూపాయల నోటు పారెయ్యగూడదూ? నేనైతే అదేపని చేసేవాణ్ణి. ఏం జెయ్యమంటావు. వాళ్లు నా మాటలో లేరు. నువ్వుంటావని నాకు నమ్మకం ఉంది. చూస్కో నిన్నేం చేస్తానో..."

హనుమంతప్ప మాటలతో బాటుగా కొత్త దుస్తులు, కొత్తరకం భోజనం సరికొత్తదైన మన్నన ఇవన్నీ వెంకటేసు మీద బాగా పనిచేశాయి. కొత్తగా మద్యం రుచి చూచేవాడికి ఒక గ్రుక్క మ్రింగుడు పడేసరికి బ్రహ్మానందం కనిపిస్తుంది. కానీ ఎంతగా అయోమయంలో ఉన్నప్పటికీ వెంకటేసు పూర్వాపరాలను గురించి ఆలోచించక పోలేదు. చిల్క సముద్రం చెంచునారాయణప్ప సంగతి తనకు బాగా తెలిసిందే! చచ్చి గీ పెట్టినా ఆయన తనపైన

పైసా ఖర్చు పెట్టడు. పోగా తానిలా హనుమంతప్ప వైపు రావడంలో గూడెం వాళ్ళ ప్రమేయమేమీ లేదు. అందువల్ల చెంచునారాయణప్ప గూడెం వాళ్ళపైన అక్కస్సు వెళ్ళ గ్రక్కవలసిన పనిలేదు. ఐనా ఒకరోజు గూడెం పలక్కపోతే చిలకసముద్రంలో ఎక్కడి పనులక్కడే బందు. చెంచు నారాయణప్ప దొంగకు తేలుకుట్టినట్టుగా ఊరుకోవలసిందే? ఆయనగారి కలాగే కావాలి. మాదర్చేద్ దేవుడికి గోదర్చేద్ పత్రి!

ఎన్నికలు ముగిశాయి.

జానపద చిత్రంలో కథానాయకుణ్ని చెరొక వైపున నిలబడి వరించే నాయిక ద్వయంలా అదృష్టం ఒకటికి రెండు రూపాలతో హనుమంతప్పను వరించింది, చిలక సముద్రం పంచాయతీ బోర్డుకు ప్రెసిడెంటు కావడంతో బాటుగా ఆయన సమితికి ఉపాధ్యక్షుడుగా గూడా తయారై కూర్చున్నాడు.

చిలకసముద్రం చెంచు నారాయణప్పకు గడచిన నెల రోజుల్లో ఎదురైన పరాభవం ఇంతలో మరిచిపోవడానికి వీలయ్యేది కాదు. "కంటికి నిద్ర వచ్చునే, సుఖంబగునే..." ఇత్యాది బాధలన్నీ ఆయన అనుభవించాడు. కానీ విశేషమేమిటంటే ఈ అవమానం వల్ల ఆయన బుద్ధి మొద్దుబారిపోలేదు. పైపెచ్చు అదింకా చురుగ్గానే పనిచేసింది. ఇందుకు నిదర్శనం రెండు నెలల దీర్ఘాలోచన తర్వాత ఆయన తీసుకున్న నిర్ణయం.

ఆకులు, వక్కలు, పసుపు కొమ్ములు, కొబ్బరికాయలు మొదలైన మంగళ ద్రవ్యాలను తట్టల కమరించుకుని, నలుగురు సాటి బంధువులను వెంటబెట్టుకుని, పురోహితుడు ముందు నడవగా చెంచు నారాయణప్ప హఠాత్తుగా బూరగపాడులో ప్రత్యక్షమై సూటిగా హనుమంతప్పగారి లోగిట్లోకే విజయం చేసేశాడు.

వాలుకుర్చీలో సుఖాసీనుడై, పొగచుట్ట కాల్చుకుంటూ అక్కడి పెత్తందారును పిలిచి "ఒరే చెన్న కేశవులూ! వియ్యాల వాళ్ళొచ్చారని మీ అయ్యగారితో సెప్పరా!" అన్నాడు.

"కయ్యాల వాళ్ళు వియ్యాల వాళ్ళయిందెప్పుడు?" అంటూ ముసి ముసి నవ్వులతో హాల్లోకి వచ్చాడు హనుమంతప్ప.

"అయ్యా, హనుమంతప్పా? కయ్యానికి మేము మీతో దీటుగాదని తేలిపోయింది. పోతే మిగిలిన విషయాల్లో మనం మనం సరిసమానమేనని నేననుకుంటున్నాను. పోట్లాడుకున్నన్ని దినాలు పోట్లాడుకున్నాము. కోర్టుల చుట్టూ తిరిగాము. దీనివల్ల మేలుపడిందేమీ లేదు. ఎందుకొచ్చిన బెడద? అందువల్ల నాకొక మంచిపని చేయాలన్న బుద్ధి పుట్టింది. నీ కూతుర్ని మా అబ్బాయికి అడగడానికొచ్చాను. ఇష్టమైతే ఈ పళ్ళాల్ని తీయించి లోపల పెట్టించు. ఇష్టంలేదు, ఆ మాట తేల్చి చెప్పు...!"

పది పదిహేను నిమిషాల వరకు హాల్లో స్తబ్దతే రాజ్యమేలింది.

ఆలోగా లోపలికి వెళ్ళి జనానావారితో సంప్రదించి వచ్చిన హనుమంతప్ప "ఒరేయ్ చెన్నకేశవులూ! తట్టలు తీసుకెళ్ళి లోపల పెట్టించరా? అలాగే చుట్టాలకు కాఫీలు పట్టుక రారా" అన్నాడు.

పైపైకి ఈ పెళ్ళి సంబంధం ఒక సవ్యమైన పరిణామంగానే గోచరించింది. కానీ ఇందులో లోగుట్లు కొన్ని ఉన్నాయి. హనుమంతప్పగారి అమ్మాయికి కాస్తా చెముడుంది.

కాస్తా కూస్తా ఏమిటి, బ్రహ్మాండమైన చెముడేనని కొందరంటారు. ఆ పిల్లకింతకంటే భారీ సంబంధాలు రావడం కష్టం. చెంచు నారాయణప్ప ఉద్దేశం వేరు. ఆడవాళ్లు ఎంత తక్కువగా వినగలిగితే అంత మంచిదని ఆయన ఉద్దేశం. ఇందువల్ల తన కుమారుడికి తానెంతో భారం తగ్గించిన వాడవుతాడు. కానీ అదేమంత ముఖ్యంగాదు. ఈ కాలమనేదుందే, ఇది గూటం గొట్టుకుని ఇక్కడే స్థిరంగా ఉండిపోదు. గిర్రున తిరిగిపోతుంది. వచ్చే ఎన్నికల్లో తాను అబ్బాయిని ఎన్నికల్లో నిలబెడతాడు. అప్పుడు హనుమంతప్ప తగుదునమ్మా అని అల్లుడితో ఎలా పోటీ చేస్తాడో, అదీ తన కళ్లతో తానే చూస్తాడు.

ఆట కట్టయిపోయిన తరువాత చదరంగపు బలాన్నంతా ఒక కుప్పగా తోసి బుట్టలో పడవేస్తారు. అలా చేయడంలో వ్రేళ్ల సందుల్లో నుంచీ నేలపైకి రాలిపోయిన ఒక బంటును గురించి ఎవరు పట్టించుకుంటారు?

ఆ బంటే వెంకటేసు.

"ఇంక నీ జాగ్రత్తలో నువ్వుండవచ్చురా వెంకటేసూ! నీ ఆకు బయట పడిపోయింది" అని ఎవరో చెబుతే, వాళ్లు చెప్పేదేమిటో వెంకటేసు కర్థం కాలేదు.

పిలిచి పిలిచి భోజనం పెట్టే మర్యాదగూడా ఆ నాటితో ఆఖరై పోయింది. విస్తరి చేత బట్టుకుని తనంతట తానే వెళ్ళినా భోజనం పెట్టాలన్న ధ్యాస ఎవరిలోనూ కనిపించడంలేదు.

పూర్తిగా విడమరచి చెబుతే గానీ అర్థం చేసుకోలేని మూర్ఖత్వానికి ఎవరో ఒకరు విరుగుడు మందు ఇవ్వవలసి వచ్చింది. ఆ పనికి పూనుకున్న వ్యక్తి సక్కూబాయమ్మ. ఆమె హనుమంతప్ప తల్లి.

"నీ పనేదో నువ్వు చూచుకో గూడదట్రా వెంకటేసూ? దంచినమ్మకు బొక్కిందే కూలీ అనుకోవాలి మరి? పోనీలే, ఈ పూట భోజనం చేసే వెళ్ళు..."

తెరతీయగానే మూలవిరాట్టు కనిపించినట్టుగా, సక్కూబాయమ్మ వీడ్కోలు మాటతో వెంకటేసుకు అప్పటి తనస్థితీ, గతీ బాగా అవగతమై పోయింది.

మరునాటి ఉదయం తెల్లవారక మునుపే వెంకటేసు బూరగపాడు వదిలి పెట్టేశాడు. ఊతకొమ్మ పోతే పోయింది. తనకిప్పుడు పట్టుగొమ్మ మాత్రం ఎక్కడుంది? బూరగపాడుకు తనతో పనితీరిపోయింది. చిలకసముద్రానికి తనను నమలి మ్రింగేయాలన్నంత కోపంగా ఉంది. స్వంత ఊరికి తాను తీరనిద్రోహం చేశాడు. తనతో ముఖమిచ్చి మాట్లాడే వాళ్ళెవరున్నారు?

మనిషైన వాడికంట పడకుండా ఉండడం కోసం ఆ రోజంతా వెంకటేసు విశ్వప్రయత్నం చేశాడు. మామిడి తోపుల్లోనూ, చిట్టడవి పొదల్లోనూ కాలక్షేపం చేశాడు. చీకటి పడిన తర్వాత నర సంచారంలేని ప్రదేశంలో ఉండలేక చిలకసముద్రానికి దగ్గరగా వచ్చి గ్రామ శక్తి దేవళం ఎదుట మండపంలో పడుకున్నాడు. ఎప్పుడు నిద్రపట్టిందో ఏమిటో? మళ్లీ తెల్లవారబోతున్నదన్న భీకరసత్యం కొరడాతో కొట్టినట్టుగా నిద్రలేపింది. రైతులు పొలాలకు బయల్దేరక మునుపే తాను కనుమరుగై పోవాలి. కానీ నడిచే ఓపికను

తన కాళ్ళిప్పుడు కోల్పోయినట్టున్నాయి. కాటమరాజు గుట్ట మొగదలలో ఉన్న వేపచెట్టు క్రిందికి రాగానే అవింక ముందుకు సాగడానికి మొరాయించాయి. పై గుడ్డ విదిలించి నేలపైన వేసుకుని అక్కడే కూలబడిపోయాడు వెంకటేసు.

ఏడు గుర్రాల రథంలో మండే దేవర ఒక్క బిర్రున పైకి వచ్చేశాడు. మహానుభావుడు తన దొరతనం క్రింద కంతదఘ్నంగా తిన్నవాళ్ళెందరు, కడుపు మాడుతుండగా విలవిల లాడిపోతున్న వాళ్ళెందరు అని లెక్క చూచుకోకుండా ముందుకు సాగిపోతున్నాడు. పడమటి కొండ మజిలీ ఇంకొక పది గడియల ప్రయాణంలో ఉంది...

చల్లగా చెంపకేదో సోకినట్టయింది. కనురెప్పలపైన గూడా అలాంటిదే చల్లటి స్పర్శ. కళ్ళు తెరిచాడు వెంకటేసు. బూసులు క్రమ్ముకపోయినట్టున్న కళ్ళకు మసక మసకగా ఏదో ఆకారం గోచరించింది. "నేనయ్యా దొర్సామిని? ఇదేంటయ్యా ఈడ తొంగున్నావు? రాయ్యా, ఇంటికెళ్దాం గానీ..."

వెంకటేసు కళ్ళల్లో నీళ్లు క్రమ్ముకున్నాయి. కుర్రవాడి భుజంపైన చేయివేసి గాఢంగా గుండెలకు హత్తుకుంటూ "దొర్సామీ? నేనిక్కడున్నానని నీకెలా తెల్సింది?" అన్నాడు.

"ఎవరో పేడకొచ్చినోళ్ళు సెప్పినారు. లగెత్తుకొచ్చేసినాను. అమ్మ ఇంట్లో లేదు. బట్రామయ్య గోరిది మడి కలుపు తీయడాని కెళ్ళింది. చేసిపెట్టిన అన్నం కుండలో ఉంది. రాయ్యా, అన్నం తిని ఇంట్లోనే పడుకుందువుగానీ..."

"ఒద్దురా దొర్సామీ? నేను తిన్నానురా? నిన్నొదిలి పెట్టి మూడు నెల్లపాటు ముక్కుదాకా మెక్కినాన్రా? నాకోసం నువ్వెందుకురా ఒచ్చింది? ఒద్దు. వెళ్ళిపోరా దొర్సామీ? నేన్రాను. రానంటే రాను. ఇక్కడే పడుంటాను..." చెంపలపైకి జారుతున్న కన్నీరు కొడుక్కి కనిపించకుండా ముఖం అవతలికి త్రిప్పుకుంటూ అన్నాడు వెంకటేసు.

అయిదు నిమిషాల వరకూ తండ్రీ కొడుకులిద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. ఒక చిన్న గుడిసె. అందులో తల్లి, ఆమె చేసిపెట్టే తిండి. అందుకోసం ఆమె చేసే కూలీ నాలీ... ఈ విషయాలు తప్పా మరేమీ తెలియని పసివాడు తలవంచుకుని నేలపైన ఏవో పిచ్చి గీతలు గీస్తున్నాడు.

తటాలున లేచి కూర్చున్నాడు వెంకటేసు.

బుగ్గలు పుణుకుతూ "ఎళ్ళిపోరా నాన్నా? నేను గూడెంలోకి రాలేన్రా? నీకు తెలీదు. నువ్వెళ్లిపోమ్మా? నా బుజ్జివి గదూ..." అన్నాడు.

"ఊఁహూ" అడ్డంగా తలాడించాడు కుర్రవాడు." ఇక్కడుంటే నీకెవురొండిపెడతారు? అమ్మ ఇంట్లో లేదుగా? నీ పాటుకు నువు తిని పడుకుంటే పోలా? రాయ్యా. ఎల్లిపోదాం" గట్టిగా చెయ్యి పట్టుకుని తండ్రిని లేవదియ్య జూస్తున్నాడు దొరసామి.

తండ్రిగా తన పెద్దరికం నిల్పుకోలేని వెంకటేసు కళ్ళకు ఆ క్షణాన ఆ పదేళ్ల కుర్రవాడు తనకంటే పెద్దవాడుగా కనిపించాడు. తన తండ్రి బ్రతికుంటే తననిలాగే పిలిచేవాడేమో? తప్పు చేసిన బిడ్డను మన్నించడం తండ్రికి మామూలే. పశ్చాత్తాపపడిన కొడుకు తండ్రి పిలవగానే లేచి వెంబడించడంగూడా రివాజే. ఇక్కడందుకు విరుద్ధంగా జరిగినట్టుగా లేదు వెంకటేసుకు–

జనమంతా పని పాటలకు వెళ్ళిపోయారేమో, గూడెంలో ఏమంత సందడిగా లేదు. గొళ్ళానికి చిలుకుతో కలిపి కట్టి పెట్టిన త్రాటిని విప్పేశాడు దొరసామి. వెంకటేసును లోపలికి తీసుకెళ్ళాడు. కంచం తెచ్చిపెట్టి కుండలో ఉన్న అన్నమంతా అందులోకి కుమ్మరించేశాడు. పిడతలో ఉన్న కూర నందులోకి వంచేశాడు. సత్తు గళాసులో నీళ్ళు తెచ్చి పెట్టాడు.

"తినయ్యా? ఆకలిగా ఉంటే గానీ నువ్వలా పడుకోవని నాకు తెల్సుగా! అమ్మొస్తే నేను చెబుతాన్లే..."

కొడుక్కు తానన్నం పెట్టవలసింది పోయి వాడు తనకింత అన్నం పెడుతున్నాడు. బోరు బోరున ఏడవాలనిపించింది వెంకటేసుకు.

వెంకటేసు అంతరంగానికిన్నీ, బాహ్య ప్రపంచంలో వాతావరణానికిన్నీ ఏదో దగ్గరి సంబంధం ఉన్నట్టుగా రివ్వు రివ్వన గాలి వీచసాగింది. అతడి కడుపులో ఆకలి చల్లారేసరికి జల్లు జల్లుమంటూ ఉబ్బ చినుకులు గూడా రాలసాగాయి. వెంకటేసు వెలుపలికి చూచాడు. మబ్బులు దట్టంగా ముసరుకుంటున్నాయి. వాన బలం కావచ్చు. కూలీకి వెళ్ళిన జనం తిరిగి వచ్చేస్తారేమో? రంగి కంట పడకుండా తానొక బల్లిగా మారిపోయి గోడ కంటుకుపోయినా బాగుండి పోవును.

"వానొస్తోంది... అమ్మ తడిసి పోతుందేమో? గూడ తీసికెళ్తానయ్యా..." తాటాకుగూడ తలపైన బోర్లించుకుని విడిచిపెట్టిన బాణంలా వానలోకి దౌడు తీశాడు దొరసామి.

వచ్చేస్తుంది. రంగి వచ్చేస్తుంది. వెంకటేసు పాదాలు గుమ్మంలో నిలవలేదు. తలుపు ఓరవాకిలిగా వేసుకుని అతడు గుడిసె వెనుక వైపుకు వెళ్ళి చూరు క్రింద నిల్చున్నాడు.

పది పదిహేను నిమిషాల తర్వాత మళ్ళీ తలుపు తెరుచుకుంటున్న చప్పుడు వినిపించింది.

"సమయానికి గూడ తెచ్చావుగానీ లేకుంటే తడిసి ముద్దయిపోయి ఉండేదాన్ని. అప్పటికీ సగం తడిసిపోయాను. పొయ్యి సెగన కూచుంటే ఆరిపోతుందిలే. పొయిలో నిప్పుందేమో సూడరా దొర్సామీ."

"నిప్పున్నట్టు లేదు. ఆరిపోయింది..."

"పోతేపోయిందిలే. కాసేపటికదే ఆరిపోతుంది. ఎలాగో తెల్లారిపూటే ఇంత వండి పడేశాను గనుక సరిపోయింది. లేకుంటే వానకూ దానికీ పొయిమండక అగోరించేదాన్ని..."

దొరసామి కిక్కురుమనడంలేదు.

"కిర్సనాయిలుగూడా నిండుకున్నట్టుంది. వెల్తురుండగానే తలా కొంచెం తినేస్తే పోలా, కంచాలు పెట్టరా దొర్సామీ..."

"అన్నం నేను తిన్నానమ్మా? నీకే లేంది..."

"ఏమిట్రా? నువ్వు తిన్నావా? అంతన్నం నువ్వెలా తిన్నావురా దొర్సామీ? కూర కూడా లేదే?"

పట్టుబడిన నేరస్తుడిలా చిక్కి బిక్కరిస్తున్నట్టున్నాడు దొరసామి. ఐనా వాడు తండ్రి గౌరవానికింకా పెట్టని కోటలా నిలబడాలనే చూస్తున్నాడు.

"నిజం. నేనే తినేశానమ్మా?"

"ఊంహూ' తల పంకిస్తూ అంది రంగి. ఆమె కర్థమయ్యే ఉంటుంది. తనకు పెళ్ళయి ఇది పన్నెండో యేడు. ఈ పది పన్నెండేళ్ళలో పట్టుగా ఇంటి పట్టున ఉండి తాను కాలాన్ని కష్టాన్ని కుటుంబంకోసం వెచ్చించింది లేదు. ఆదినుంచీ తాను అల్లాటప్పాగా తిరగడానికే అలవాటుపడ్డాడు. చెప్పకుండా వెళ్ళిపోయి తిరిగి ఇంటికి వచ్చినప్పుడల్లా ఇలా చాటుగా ఇంట్లో దూరి కుండ ఖాళీ చేసెయ్యడం ఇక్కడ పాత కథే!

తల్లి ఎదుట పడడానికి మనసు చెల్లక తండ్రి బయటుండి పోతున్నాడని దొరసామికి తెలుసు. ఆ సంగతి తల్లికి తెలుసునని గూడా తెలుసు. ఈ పొందని, పొసగని పరిస్థితి సర్దుబాటు కావాలంటే కొంతసేపు తానెక్కడైనా ఉండి రావాలనికూడా తెలుసు...

"అమ్మా! నేను భజనకూటానికి పోతున్నా..."

చూరుక్రింద నిల్చున్న వెంకటేసు హైకోర్టుకు అప్పీలు చేసి తీర్పుకోసం ఎదురుచూస్తున్న జీవిత ఖైదీలా దిగాలు పడిపోయాడు. ఇప్పుడిక ఏ క్షణాన్నయినా రంగి తనపైన విరుచుకపడవచ్చు.

ప్రతిక్షణమూ ఒక యుగంలా గడపడమంటే ఏమిటో ఇప్పుడు వెంకటేసుకు తెలిసి వస్తోంది.

ఆకాశాన కారు మబ్బులాడుతుండడం వల్ల గూడెం గాడాంధకారంలో మునిగిపోవడాని కెంతోసేపు పట్టలేదు. పోటెత్తిన సముద్రంలో అలల హోరులా గాలి జోరు హెచ్చింది. మద్దెలలు మ్రోగినట్టుగా దూరంగా ఎక్కడో వాన సవ్వడి.

తాను వానలో తడిసిపోతున్నట్టు తెలిస్తే రంగికి ప్రాణం నిలవదు. ఆ వాన కాస్తా గూడెంలోకి రాగూడదూ?

ఆన్ చేసి పెట్టిన రేడియో కరెంటు రాగానే గొంతు విప్పుకున్నట్టుగా ఉండి ఉండి ఎప్పుడో ఒక క్షణాన గుడిసెలో నుంచీ మాటలు వెలువడ్డాయి.

"తినేందుకులేని పట్టింపు ఇంట్లో ఉండటానికొచ్చిందేమో? మరేం పరవాలేదు. లోపలికి రావచ్చు. చేసిన నిరవాకానికి తోడుగా ఈ బింకం ఒకటా? బొట్టూ, కాటికా పెట్టి లోపలికి పిలవాల్సిన అక్కర ఇక్కడెవురికీ లేదు..."

ఇంతకు మించిన తియ్యటి స్వాగతం వెంకటేసు కక్కర్లేకపోయింది.

"చూడు రంగీ! నాకు బుద్దొచ్చింది. కట్టుకున్న భార్య, కన్నకొడుకు తప్పితే లోకంలో మనిషికయ్యేవాళ్ళెవరూ లేరని తెలిసొచ్చింది. వగాతగాలేని మగవాణ్ణి కట్టుకుని నువ్వేమనుభవించావు? కట్టుకున్న చీర వానకు తడిసిపోతే విప్పి పెట్టడానికి నీకు మారు చీర లేకపోయింది. నా ప్రయోజకత్వం తగలబడినట్టే ఉంది. నేనన్నీ పనికిమాలిన పనులే చేశాను. తల తిరిగినప్పటికీ కవలం నోటి దగ్గరికి రాకపోతుందా సెప్పు... మాటాడవా రంగీ?"

తాళం బిగించినట్టుగా రంగి పెదవులు విడివడడం లేదు.

"నేను చేసిన పనికి నువ్వు నన్నెలాగైనా తిట్టొచ్చు. తిట్టు రంగీ? బంగారులాంటి నిన్ను, ముత్తెంలాంటి బిడ్డను వదిలిపెట్టి మూడు నెలలుగా నా కడుపే కైలాసమనుకున్నాను. ఆ భోగం శాశ్వతం కాదని తెలిశాకగానీ నా కళ్ళకు గప్పిన పొర తొలగలేదు. సెబుతున్నానుగా! ఇక మీదటెప్పుడు మిమ్మల్ని వదిలిపెట్టి వెళ్ళను. నీపైన ఒట్టు. కావలిస్తే నీ పాదాలు పట్టుకుని చెబుతాను..."

"ఛాఛా. దూరంగా ఉండు, మగాడివై ఉండి ఆడదాని పాదాలు పట్టుకుంటావా? బావుందిలే వరస..."

రంగి పొరుగింటికి వెళ్ళి బుడ్డీ దీపం నిండుకూ కిరసనాయిలు పోయించుకొచ్చింది. పొయి ముట్టించి అన్నం వండింది. కొడుకును కేకేసుకొచ్చి అన్నం పెట్టింది. గోనెసంచిలో కాళ్ళు దూర్చుకుని కుర్రవాడు నిద్రాదేవత ఒడిలోకి జారిపోయాడు.

"నువ్వన్నం తినలేదా రంగీ?" మళ్ళీ వెంకటేసే పలకరించాడు.

"లేకుంటే లేనిపాడు. ఇంట్లో ఉన్నావుగా? కలిసే తిందాం. లేచి కూచో..."

"సత్తెం చెబుతున్నాను రంగీ? నేనింక ఇల్లు ఒదిలి పెట్టేది లేదు. ఆడపనీ, మగపనీ రెండూ నువ్వే చేసుకుంటూ ఇంతకాలం సంసారం ఎవీదుకొచ్చావు. ఇకపైన అలా జరక్కూడదు..."

అన్నం వడ్డిస్తూ ఉన్న రంగి అలాగే భర్త ఎదుట కూర్చుని అర్థం కానట్టు సూటిగా ప్రశ్నించింది.

"ఏంటయ్యా నువు సెప్పేది?"

"అదే, నువ్వెందుకు కూలీ కెళ్ళాలి? ఆ పనేదో నేను సెయ్యలేనా? బేషుగ్గా సెయ్యగలను. నువ్వు చూస్తూండు, రోజుకు రెండో మూడో తెచ్చి నీ చేతిలో పడేయక పోను..."

"ఆనందమైపోయింది గానీ ఊర్కోమామా! నీతులు చెప్పొచ్చాడమ్మా ఇంత కాలానికి మగ మారాజు! కాకపోతే నువు కూలీ కెళ్తావా? అదిగాదు నువ్వా మామా ఒకరికింద చాకిరీపన్లు చేసేది? పంచాయతీ బోర్డు నెంబరువై ఉండి ఆ మాట సెప్పడానికి నీకు నోరెలా వచ్చింది? చాల్లే ఊరుకో? ఎవురైనా నవ్విపోయేరు..."

రాజుల కాలం పోయింది. ప్రజల కాలం వచ్చింది. అందువల్ల ఈనాడు ప్రజలే రాజులు. ఆ లెక్కన రంగి ఒక రాణి గాకపోదు. ఒక మహారాణీలో కనిపించవలసిన ఔద్ధత్యమున్నూ ఆత్మాభిమానమున్నూ ఇప్పుడు రంగి ముఖంలోనే కానవస్తున్నాయి. తల దిమ్మదిరిగి పోయినట్టుగా తెల్లబోయి కూర్చున్న వెంకటేసును మళ్ళీ ఆవిడే స్తబ్దతలోనుంచీ లేపవలసి వచ్చింది.

"పిచ్చి పిచ్చిగా మాట్లాడకుండా నువ్వన్నం తిను మామా? నేనున్నాను. నా రెక్కల కష్టముంది. నీకెందుకు? వేళకింత తిను. నీ పాటుకు నువ్వుండు. నీ సంపాదన నాకక్కర్లేదు. పంచాయితీ బోర్డు నెంబరు పెళ్ళానన్న కితాబొక్కటే చాలు నాకు.

♦ 'యువ' మాసపత్రిక – *1971* ♦